
షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక




సంపుటి : 1 సంచిక : 245 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 4 ఆగస్టు 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 245 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 4 August 2024 PAGES : 8 PRICE : 3/-

# పదవులపై రాని క్లారిటీ

- ఇప్పుడు కాకపోతే... మరెప్పుడు...
- పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీలో పదవుల కోసం చాలా మంది నాయకులు ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.
- నామినేటెడ్ పోస్టులను కూడా ఎన్నడూ లేనట్లు వేగంగా భర్తీ చేసింది సీఎం రేవంత్ రెడ్డి సర్కార్.
- కొన్ని విషయాల్లో స్పీడుగా నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వం ముఖ్యమైన అంశాలపై ఎడతెగని జాప్యం చేస్తోందని కాంగ్రెస్ నేతల అసంతృప్తి



హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు 9 నెలలు కావస్తోంది. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీలో పదవుల కోసం చాలా మంది నాయకులు ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. అందుకే నామినేటెడ్ పోస్టులను కూడా ఎన్నడూ లేనట్లు వేగంగా భర్తీ చేసింది సీఎం రేవంత్ రెడ్డి సర్కార్. ఐతే కొన్ని విషయాల్లో స్పీడుగా నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వం ముఖ్యమైన అంశాలపై ఎడతెగని జాప్యం చేస్తోందని కాంగ్రెస్ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రమంత్రి మండలిలో 18 మందికి అవకాశం ఉండగా, ప్రస్తుతం సీఎంతోసహా 12 మంది మాత్రమే ఉన్నారు. ఇంకా ఆరుగురికి చాన్స్ ఉన్నా? మంత్రివర్గాన్ని విస్తరించకుండా పెండింగ్‌లో పెట్టారు. ఇక మంత్రి మండలి విస్తరణనే కారణంగా చూపి పీసీసీ చీఫ్‌ను నియమించలేదు. మరోవైపు అసెంబ్లీలో కీలకమైన డిప్యూటీ స్పీకర్, చీఫ్ పదవులను కూడా భర్తీ చేయకపోవడంతో విలువైన సమయం కోల్పోతున్నామని సీనియర్ నేతలు - మిగతా3లో



## పేదోడి ఆలోచనకు అనుగుణంగా
# ఇండస్ట్రీయల్ పార్కు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ప్రజల దీవెనలతో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చింది
- అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వానికి రెండు రెండు కళ్లు, జోడెడ్ల లాగా సాగుతున్నాయి

జయశంకర్ భూపాలపల్లి

పేదోడి ఆలోచనకు అనుగుణంగా గాంధీనగర్ ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజల దీవెనలతో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వానికి రెండు రెండు కళ్లు, జోడెడ్ల లాగా సాగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి - మిగతా3లో

# మాదిగ జాతి ఎవరికి వ్యతిరేకం కాదు

- దామోదర కీలక వ్యాఖ్యలు
- తీర్పును ప్రభుత్వం భవిష్యత్తులో అమలు చేస్తుంది..
- తమ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం సీఎం తనను పిలిచి కమిటీ వేసి, మాదిగ జాతికోసం ముందుకు వెళ్లాలని సూచించారు
- తాము సమానత్వం కోసం పోరాటం చేస్తున్నాం
- బడ్జెట్‌లో రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇవ్వాలని మహిళలకు నిర్ణయం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క





హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. తీర్పును ప్రభుత్వం భవిష్యత్తులో అమలు చేస్తుందని.. సీఎం రేవంత్ రెడ్డి శాసన సభలో ఒక స్టేట్మెంట్ ఇచ్చారని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం సీఎం తనను పిలిచి కమిటీ వేసి, మాదిగ జాతికోసం ముందుకు వెళ్లాలని సూచించారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఈ అంశంలో వాదనలు వినిపించడంలో భాగమైందని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మాదిగ జాతి ఎవరికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. తాము సమానత్వం కోసం పోరాటం చేస్తున్నామని ఉద్ఘాటించారు. జాతినే అంటారని తనమంటే దుర్మార్గమని తీవ్రంగా వ్యతిరేకిస్తాం, ఖండిస్తామని అన్నారు. - మిగతా3లో

# దొంగ నోట్ల ముఠాను అరెస్టు చేసిన మెట్ పల్లి పోలీసులు





షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి ఆగస్టు 03

జగిత్యాల జిల్లాలో అసలు నోట్లకు రెండింతలు దొంగ నోట్లు ఇస్తామని పలువురిని మోసం చేస్తూ పది లక్షల రూపాయల వరకు లాక్కొని పరార్ అయిన ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసిన మెట్ పల్లి పోలీసులు శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మెట్ పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జగిత్యాల పట్టణానికి చెందిన బిట్టు అలియాస్ శివకుమార్ జగిత్యాల జిల్లా తాళ్ల ధర్మారం కు చెందిన సదాల సంజీవ్ నిర్మల్ జిల్లాకు చెందిన మగ్గిడి కిషన్ కలకుంట్ల గంగారం బొంగురాల పుల్లయ్య ముని మేకల అశోక్ అనే ఈ ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు వారి వద్ద నుండి ఏడు లక్షల రూపాయల నకిలీ నోట్లు ఒక కారు ఒక ద్విచక్ర వాహనం 6 సెల్ ఫోన్లు ఐదు వేల రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు ఈ ఆరుగురు వ్యక్తులు గత సంవత్సర కాలంలో ఇద్దరు చొప్పున ముఠాగా ఏర్పడి హైదరాబాద్ ఉమ్మడి కరీంనగర్ ఆదిలాబాద్ జిల్లాలో కొందరి వద్ద పది లక్షల రూపాయల వరకు డబ్బులు లాక్కొని పరారీ అయినట్లు తెలిపారు ఈ నెల ఒకటో తేదీ గురువారం కోరుట్ల మెట్ పల్లి మధ్యలో ఉన్న పెద్ద గుండు వద్ద దాబా యజమాని రాజేందర్ వద్ద లక్ష రూపాయల నగదు లాక్కొని పారిపోయినట్లు ఆ దాబా యాజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా అతని ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకొని మెట్ పల్లి సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో కేసును దర్యాప్తు చేస్తున్న సమయంలో ఈ ఆరుగురు వ్యక్తులు మెట్ పల్లి పట్టణానికి ఆనుకొని ఉన్న వెంకట్రావు పేట్ వీరేంద్ర దాబాలో ఈ ఆరుగురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం అందుకున్న సిఐ నిరంజన్ రెడ్డి ఎస్సై చిరంజీవి ఎస్సై రాజు ఈ ముఠాను ఎంతో చాకచక్యంగా అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు డీఎస్పీ ఉమామహేశ్వరరావు తెలిపారు ఈ దొంగ నోట్ల ముఠాను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నందుకు మెట్ పల్లి సీఐ నిరంజన్ రెడ్డిని ఎస్సైలు చిరంజీవి రాజులను పోలీస్ సిబ్బందిని డీఎస్పి ఉమామహేశ్వరరావు అభినందించారు

# ఎక్సైజ్ శాఖలో అక్రమాలు

- కాగ్ నివేదికలో సంచలన విషయాలు..
- 179కేసులకు సంబంధించి పన్నులు తక్కువ చెల్లించడం, ఆలస్యంగా చెల్లించినా అపరాధ రుసుం వసూలు చేయకపోవడం చేశారని వెల్లడి
- అవకతవకలు అన్నీ 2017-22మధ్య జరిగినట్లు తనిఖీల్లో గుర్తించాం
- 46 బార్ అండ్ రెస్టారెంట్లు తమ లైసెన్సుల పునరుద్ధరణ రుసుం, వార్షిక బార్ ఎక్సైజ్ పన్ను చెల్లింపుల విషయంలో ఆలస్యం
- ఆలస్యం చేసినందుకు విధించాల్సిన రూ.86.99లక్షల అపరాధ రుసుంను సైతం ఎక్సైజ్‌శాఖ విధించలేదు

హైదరాబాద్

తెలంగాణ ఎక్సైజ్‌శాఖకు పన్ను చెల్లింపు విషయంలో రూ.77 కోట్ల అక్రమాలు జరిగినట్లు కాగ్ తన నివేదికలో వెల్లడించింది. అవకతవకలు అన్నీ 2017-22మధ్య జరిగినట్లు తనిఖీల్లో గుర్తించామని తెలిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ పని తీరుపై కాగ్ మండిపడింది. 179కేసులకు సంబంధించి పన్నులు తక్కువ చెల్లించడం, ఆలస్యంగా చెల్లించినా అపరాధ రుసుం వసూలు చేయకపోవడం చేశారని వెల్లడించింది. - మిగతా3లో

CAG

# తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించొద్దు

**యాదాద్రి జిల్లా ఆర్యవైశ్య మహాసభ సేవాదళ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్**

**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి ఆగస్టు 03:** తెలుగు విశ్వవిద్యాలయానికి ఉన్న పొట్టి శ్రీరాములు పేరు తొలగించకుండా అలాగే ఉంచాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ సేవాదళ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ముఖ్యంగా తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక తెలుగు రాష్ట్రం ఉండాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆత్మ బలిదానం గావించిన పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అనిర్వచనీయమని అన్నారు. తెలుగు రాష్ట్రాన్ని సాధించి తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని కాపాడిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. భావితరాలకు ఆయన త్యాగాన్ని గౌరవించుకునే విధంగా జ్ఞాపకార్థం గా తెలుగు యూనివర్సిటీకి ఆ మహనీయుడి పేరు పెట్టడం జరిగిందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు బదులుగా సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని భావించడం సరికాదన్నారు. సురవరం ప్రతాపరెడ్డి కూడా తెలంగాణకు అందించిన సేవలు మరువలేనివని ప్రత్యామ్నాయ అవకాశాలు వెతుక్కొని ప్రతాపరెడ్డి పేరు పెట్టి గౌరవించుకుందామని సూచించారు. ఈ సమావేశంలో యాదాద్రి జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం జిల్లా కోశాధికారి కస్తూరి వెంకటేష్ సముద్రాల శివ పాల్గొన్నారు.



# పాపారాయ విద్యా నికేతన్ పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం

**షణ్ముఖ వెలుగు మేడ్చల్ ప్రతినిధి ఆగస్టు 03:** మేడ్చల్ పట్టణంలోని పాపారాయ విద్యా నికేతన్ పాఠశాలలో మల్లారెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నరసింహారెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో కంటి సంబంధిత డెంటల్ జనరల్ సర్జన్ కు సంబంధించిన వాటికి విద్యార్థులకు విద్యార్థి తల్లిదండ్రులకు ఉచితంగా వైద్యం చేసి అవసరమైన వాళ్లకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మర్రి దీపికా నరసింహారెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల దృష్ట్యా విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రతను పాటించాలని రోగాలను దరి చేరనీయకుండా కాపాడుకోవాలని అన్నారు. పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రవీందర్ రెడ్డి నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ శ్రీనివాస్ రెడ్డి సంతోష్ మేడ్చల్ మండలం ప్రైవేట్ పాఠశాలల ప్రెసిడెంట్ గిరిబాబు అడ్వైజర్ పాండు పాఠశాల యాజమాన్యం రామేశ్వర్ రెడ్డి నరసింహ గౌడ్ ఆంజనేయులు ఉపాధ్యాయులు విద్యార్థులు వైద్యులు తదితరులు పాల్గొన్నారు..




## బీరోలు గ్రామ సమస్యలపై పొంగులేటి ప్రసాద్ రెడ్డికి గ్రామస్థుల వినతి



**షణ్ముఖ వెలుగు తిరుమలాయపాలెం ప్రతినిధి ఆగస్టు 03:** గత పాలకుల నిర్లక్ష్యం వల్ల బీరోలు గ్రామ పంచాయతీ అభివృద్ధికి నోచుకోలేదని గ్రామంలో ఎన్నో మౌలిక సదుపాయాలు నెలకొల్పాల్సినా గత పాలకులు గ్రామాన్ని నిర్లక్ష్యంగా వదిలేశారు. బీరోలు గ్రామ వాసి మండల కాంగ్రెస్ నాయకులు మిర్యాల విక్రమ్ రెడ్డి పొంగులేటి క్యాంప్ ఆఫీసులో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొంగిలేటి ప్రసాద్ రెడ్డి ని కలిశారు. గ్రామ సమస్యలతో కూడుకున్న వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు . రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని పాలేరు ఎమ్మెల్యే రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు గ్రామ పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపించి గ్రామాన్ని దత్తత తీసుకొని గ్రామాన్ని అన్ని విధాల మౌలిక వసతులు కల్పించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు ఆయన సానుకూలంగా స్పందించి గ్రామ సమస్యలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో మండల కాంగ్రెస్ నాయకులు మిరియాల విక్రమ్ రెడ్డి మండల కాంగ్రెస్ నాయకులు మిర్యాల విక్రం రెడ్డి వెన్నం సుధాకర్ రెడ్డి పొదిల ప్రేమ్ కుమార్ వల్లోజు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్**

**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి ఆగస్టు 03:** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్ శనివారం జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసి కలెక్టర్ తో మాట్లాడుతూ ఇటీవల పెద్దా పూర్ బాలుర గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని కోరుట్ల నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలను ఆనుకుని ఉన్న చుట్టుప్రక్కల ప్రాంతాల్లో అపరిశుభ్రత లేకుండా చూడాలని పాఠశాలల్లో అలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పల్లెలు పట్టణాలు అని తేడా లేకుండా విష జ్వరాలు విజృంభిస్తున్నాయని పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి దోమలు వృద్ధి చెందకుండా ఆ ప్రాంతంలో పరిశుభ్రత పాటించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాకాలం సీజన్ లో కలుషిత నీరు పారిశుధ్యం లోపించి



వ్యాధులు ప్రబలుతున్నాయని ఆరోగ్య కార్యకర్తలు సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఇంటింటికి వెళ్లి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఆదేశించాలని కోరుట్ల నియోజకవర్గం లోని అన్ని ప్రభుత్వ వైద్యశాలలో పారిశుద్ధ్యం పాటిస్తూ అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా వైద్యులు కూడా అందుబాటులో ఉండేలా ప్రజలకు తక్షణమే వైద్య సదుపాయం అందేలా ఆదేశించాలని కోరారు ఆయన వెంట తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ న్యాయవాది ఎల్మల రాంబాబు తదితరులు ఉన్నారు

# విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు అలవర్చుకొని ఎదగాలి

**– ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఇందిరా హై స్కూల్ లో విద్యార్థుల పట్టాభిషేక మహోత్సవం**



**షణ్ముఖ వెలుగు ఉప్పల్ ప్రతినిధి ఆగస్టు 03:** శనివారం ఇందిరా హైస్కూల్ లో ఇన్వెస్టిట్యూర్ సెరమనీ ఘనంగా జరిగింది.ముందుగా నృత్య ప్రదర్శనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ నాచారం ఎస్సై మెహబూబ్ అలీ హాజరై విద్యార్థులకు బ్యాడ్జెస్ స్లాసెస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్న తనం లో నాయకత్వం లక్షణాలు ఎంతో అవసరం అని ఇందిరా హై స్కూల్ విద్యార్థుల కు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అన్వర్ మోహినుద్దీన్ అఫ్సర్ మోహినుద్దీన్ ప్రిన్సిపాల్ షేహనాజ్ బేగం వైస్ ప్రిన్సిపాల్ అయేషా పీఈటీ శేఖర్ టీచర్లు పేరెంట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు గౌడ్ ను ఘనంగా సన్మానించిన గోప సంఘం




**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి ఆగస్టు 03:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన ప్రిన్సిపాల్ గా పదవి బాధ్యతలు చేపట్టిన పూజారి వెంకటేశ్వర్లు గౌడ్ ను ఆలేరు గోప(గౌడ్ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) అధ్యక్షుడు బొమ్మకంటి బాలరాజు గౌడ్ గౌరవ అధ్యక్షులు గాజుల రామచంద్రయ్య గౌడ్ దూడల చంద్రమౌళి గౌడ్ సంయుక్తంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా బొమ్మకంటి బాలరాజు మాట్లాడుతూ కళాశాల విద్యార్థుల సంఖ్య పెంచుతూ ఉత్తమ ఫలితాలు సాధించేందుకు నూతన ప్రిన్సిపాల్ కృషి చేయాలని కోరారు. దీని కోసం తల్లిదండ్రుల సామాజిక సంస్థల సహకారంతో పాటు ప్రజల సహకారం తీసుకోవాలని సూచించారు. తెలంగాణలోనే ఆలేరు విద్యార్థుల్ని అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదగడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జూకంటి వెంకటేష్ రాములు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

**కరస్పాండెంట్ సిస్టర్ అనిస్**




**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి ఆగస్టు 03 :** విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని జేఎంజె కరస్పాండెంట్ సిస్టర్ అనిస్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రం జేఎంజే ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపల్ సిస్టర్ జయ భార్గవి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు నాయకత్వ నైపుణ్యాన్ని పెంపొందించేందుకు పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిస్టర్ అనీస్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ఎన్నికలపై అవగాహనతో పాటు పాఠశాల వయసు నుంచే ఇతరులకు సహాయం చేయాలనే ఆలోచన ఏర్పడుతుందన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన విద్యార్థుల మార్చి ఫాస్ట్ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మైలారపు లింబాద్రి దంపతులకు ఆత్మీయ సన్మానం



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి ఆగస్టు 03:** జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో శుక్రవారం రాత్రి ప్రముఖ వ్యాపారవేత్త జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మైలారపు లింబాద్రిని తన ఆత్మీయ మిత్రులు స్థానిక వాసవి గార్డెన్ లో అభినందన సభ ఏర్పాటు చేసి మైలారపు లింబాద్రి లక్ష్మీ దంపతులను ఆత్మీయ మిత్రులు కట్కం శంకర్ చాడ శ్రీనివాస్ వెలగందుల లక్ష్మి నరసయ్య వెలగందుల జలంధర్ లు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కోరుట్ల మెట్ పల్లి పట్టణాలు వివిధ మండలాలకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు

## అడ్డ గూడూరు 3వ అంగన్వాడి కేంద్రంలో అన్న ప్రాసన కార్యక్రమం



**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి ఆగస్టు 03:** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డ గూడూరు మండల కేంద్రంలో అంగన్వాడి మూడవ సెంటర్ లో తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా ఆరునెలల పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ మల్లమ్మ మాట్లాడుతూ.. ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు ఆహారం మొదలుపెట్టాలని అన్నారు. ప్రతి రోజు తల్లి ఆహారంలో ఆకుకూరలను గుడ్లు పాలు మొలకెత్తిన గింజలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో తల్లులు గర్భిణీలు పిల్లలు ఆయా తదితరులు పాల్గొన్నారు

# పేదోడి ఆలోచనకు అనుగుణంగా ఇండస్ట్రీయల్ పార్కు

-మొదటిపేజీ తరువాయి

రేవంత్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటకు ఇన్స్‌రెన్సు, విత్తనాలకు సబ్సిడీ ఇస్తూ రైతులను రాజులుగా చేస్తున్నామని వెల్లడించారు. శనివారం నాడు భూపాలపల్లి జిల్లాలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క పర్యటించారు. గాంధీనగర్ ఇండస్ట్రీయల్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. వనమహోత్సవం కార్యక్రమంలో మంత్రులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు కోరిన విధంగా భూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇస్తామని తెలిపారు.

ఈ నెల చివరి వరకు 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన ప్రతి గ్రామానికి ఇస్తామని ఉద్ఘాటించారు. కేసీఆర్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇస్తామని ఇదిగో అదిగో అని మాయ మాటలు చెప్పి పదేళ్లలో కేవలం 1.50 లక్షల ఇళ్లను మాత్రమే కట్టించిందని.. కానీ తమ ప్రభుత్వం మొదటి విడతలోనే 4.50 లక్షల ఇళ్లు కట్టిస్తుందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పేరు ఎత్తలేదని, రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం: మంత్రి సీతక్క**

భూపాలపల్లికి ఇండస్ట్రీయల్ పార్క్ రావడం సంతోషకరమని మంత్రి సీతక్క తెలిపారు. ఉద్యోగాల వేటలో చాలా మంది



ప్రజలు ఉపాధి కోసం పట్టణాలకు వెళ్తున్నారని చెప్పారు. మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో మారుమూల ప్రాంతాల్లో ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. ఇండస్ట్రీస్ వల్ల భూపాలపల్లి యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని తీసుకువచ్చి ఎందరినో ఇబ్బందులు పెట్టారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమాతను తెచ్చి విజయవంతంగా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. జాబ్ క్యాలెండర్ తెచ్చామని చెప్పారు. స్కిల్ ఇండియా ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రుణమాఫీ జరిగిందని గుర్తుచేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఒకే సారి రూ. 2లక్షల రుణమాఫీ చేశామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ నేతలు అలా మాట్లాడటం సరికాదు: మంత్రి శ్రీధర్ బాబు**

ప్రభుత్వ బాధ్యతలు విస్మరించకుండా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. భూపాలపల్లి జిల్లాలో నీటి వనరులు, ఖనిజ సంపద ఉందని చెప్పారు. అశాస్త్రీయబద్ధంగా మేడిగడ్డ బ్యారేజి కడితే కుంగిపోవడం ప్రజలంతా చూశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏదో కుట్ర చేసిందని బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సరికాదని చెప్పారు. అధికారులను ప్రజల వద్దకు తీసుకెళ్లడం కోసం ప్రభుత్వం ముందుకు సాగుతుందని వివరించారు. అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. మంత్రి సీతక్క , సీఎం రేవంత్ రెడ్డి మహిళలను లక్షాధికారులను చేస్తామంటే ప్రతిపక్షాలు విమర్శలు చేశాయని మండిపడ్డారు. ఈ రోజు కోటి మందిని స్వశక్తి మహిళా గ్రూపు సభ్యులుగా చేర్చి మహిళలను లక్షాధికారులు చేయడానికి ప్రణాళికలు రూపొందించామని అన్నారు. ఎమ్మెల్యేలు ఇక్కడ పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి ఎంతో కష్టపడ్డారని అన్నారు. 200 పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. మొట్టమొదటి పరిశ్రమకు శంకుస్థాపన చేస్తామని చెప్పారు. ఐటీ రంగ ఉద్యోగులు కూడా జిల్లాల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు కావాలని కోరుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# నాలుగేళ్లుగా ఎదురు చూపులు

-మొదటిపేజీ తరువాయి

నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి ఆ జిల్లా కలెక్టర్ ఆఫీసు నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31, 2020 వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఆమోదించిందని గుర్తుచేశారు. ఈ సమయంలో 25.70 లక్షల దరఖాస్తులు వచ్చాయని, గత నాలుగేళ్లుగా ఈ దరఖాస్తులు ఎలాంటి పరిష్కారానికి నోచుకోలేదని చెప్పారు. మొత్తం 25.70 లక్షల దరఖాస్తుల్లో హెచ్ఎండీఏ పరిధిలో 3.58 లక్షలు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1.06 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో పరిధిలో 13.69 లక్షలు, గ్రామ పంచాయతీల్లో 6 లక్షలు, అర్బన్ డెవలప్మెంట్ అథారిటి పరిధిలో 1.35 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుదారుల సమస్యల పరిష్కారం కోసం నాలుగేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఈ దరఖాస్తులను అత్యంత ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని మంత్రి పొంగులేటి కలెక్టర్లకుసూచించారు.

**సిబ్బందిపై చర్చ...**

ఇందుకోసం, జిల్లాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని, సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై తీసుకోవాలని, ప్రతిపాదనలు పంపిస్తే రెవెన్యూ శాఖ నుంచి సిబ్బందిని సర్దుబాటు చేస్తామని తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో కూడిన మల్టీ డిసిప్లినరీ బృందాలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. క్రమబద్ధీకరణ దరఖాస్తులపై జారీచేసిన నోటీసులకు సంబంధించిన సమస్యలను నివృత్తి చేసేందుకు అన్ని జిల్లా కలెక్టరేట్‌లు, స్థానిక సంస్థల కార్యాలయాల్లో సహాయ కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్




అథారిటీ, మున్సిపాలిటీలు మినహా మిగిలిన ప్రాంతాల దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

**వెంటనే కార్యాచరణ చేపట్టాలి..**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియలో భాగస్వాములయ్యే అన్ని స్థాయిల సిబ్బంది, అధికారులకు తక్షణమే శిక్షణ చేపట్టాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ విధివిధానాలను విడుదల చేసిన నేపథ్యంలో అమలుకు అవసరమ్మైన కార్యాచరణను వెంటనే చేపట్టాలని, జిల్లా కలెక్టర్‌లు ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న ఏడు జిల్లాల్లో అత్యంత విలువైన భూములు ఉన్నాయని ఈ జిల్లాల్లో లేఅవుట్ల క్రమబద్ధీకరణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధమైన స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని తెలిపారు. వారి ఆస్తులకు చట్టపరమైన గుర్తింపుతో సహా ఆమోదించిన లే అవుట్ల ద్వారా అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఆమోదించిన లేఅవుట్ యజమానులు, ఇంటి నిర్మాణాలకు భవన నిర్మాణ అనుమతులు పొందేందుకు, బ్యాంకు రుణాలు పొందేందుకు, కొనుగోలు చేయడానికి, విక్రయించడానికి సహాయపడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# పదవులపై రాని క్లారిటీ

-మొదటిపేజీ తరువాయి

ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పదేళ్ల తర్వాత ఎంతో కష్టపడి అధికారం సాధిస్తే? అధిష్టానం జాప్యం చేయడం వల్ల ఆ అధికారాన్ని అనుభవించలేకపోతున్నామని ఎక్కువ మంది నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ లేకుండానే రెండు అసెంబ్లీ సెషన్లు ముగియడం కూడా వారి అసంతృప్తికి కారణమవుతోంది. ఈ రెండు పదవులపై చాలా మంది ఎమ్మెల్యేలు ఆశలు పెట్టుకున్నారు. ఐతే సీఎం రేవంత్‌రెడ్డి కానీ, పార్టీ హైకమాండ్ కానీ ఈ విషయంపై దృష్టి పెట్టినట్లు కనిపించడం లేదని వాపోతున్నారు ఆశావహులు. ఈ రెండు పోస్టులను మంత్రి మండలి విస్తరణకు లింకు చేసి పెండింగ్‌లో పెట్టడం సరికాదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు సీనియర్ నేతలు.ప్రస్తుతం మంత్రివర్గ విస్తరణలో ఆరుగురికి అవకాశం ఉంది. కానీ ఆశావహులు మాత్రం డజను మంది ఉన్నారు. మంత్రివర్గ విస్తరణకు ప్రధానంగా సామాజిక సమీకరణాలు అడ్డొస్తున్నాయని సమాచారం. ప్రస్తుతం క్యాబినెట్‌లో లంబాడ సామాజికవర్గానికి అవకాశం దక్కలేదు. లంబాడ సామాజిక వర్గం నుంచి దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ పోటీ పడుతున్నారు. అదేవిధంగా ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి ఒకరికి అవకాశం ఇస్తామని గతంలోనే సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఆదిలాబాద్, నిజామాబాద్, రంగా రెడ్డి జిల్లాలకు కూడా అవకాశం దక్కలేదు. రంగారెడ్డి జిల్లాకు చెందిన మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి వంటి సీనియర్‌లు మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. నిజామాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డి, మదన్ మోహన్ రావు, ఆదిలాబాద్ నుంచి ప్రేమ్ సాగర్ రావు, ఉమ్మడి నల్లగొండ



నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రేసులో ఉన్నారు.మంత్రివర్గంలో అవకాశం దక్కని నేతలకు రాజ్యాంగబద్ధమైన డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్‌గా అవకాశం ఇవ్వాలని చూస్తోంది కాంగ్రెస్. కొందరు సీనియర్లకు, ముఖ్యంగా అవగాహన ఉన్న నేతలకు డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పోస్టులను ఇవ్వాలని చూస్తుందట. రంగారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ మల్ రెడ్డి రంగా రెడ్డి, రామ్మోహన్ రెడ్డిల్లో ఒకరికి మంత్రి పదవి, ఇంకొకరి డిప్యూటీ స్పీకర్ లేదా చీఫ్ విప్ ఇవ్వాలనే ప్రతిపాదన ఉందంటున్నారు. అదేవిధంగా లంబాడ సామజికవర్గం నుంచి మంత్రి వర్గంలో స్థానం ఆశిస్తున్న బాలూ నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ చేస్తే ఎలా ఉంటుందనే ప్రతిపాదన పరిశీలిస్తోందంటున్నారు. మరోవైపు సామాజిక సమీకరణలు కుదరకపోతే సీనియర్ నేతలు ప్రేమ్‌సాగర్ రావు, సుదర్శన్ రెడ్డిలలో ఒకరికి ఈ రెండు పోస్టుల్లో ఏదో ఒకటి కట్టబెట్టాలని చూస్తోందంటున్నారు.మొత్తానికి పదవుల భర్తీకి పేర్ల పరిశీలనతోనే పార్టీ కాలక్షేపం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు. ఇప్పటికే 8 నెలల సమయం ముగిసిందని.. ఇంకా ఆలస్యం చేయడం వల్ల పార్టీకి నష్టమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఎక్సైజ్ శాఖలో అక్రమాలు..

-మొదటిపేజీ తరువాయి




అలాగే అసలు పన్నులే చెల్లించని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొంది. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామని, ఇప్పటివరకూ ఎలాంటి స్పందన లేదని చెప్పింది. రాష్ట్రానికి నివేదిక ఇచ్చిన అనంతరం ఎక్సైజ్ శాఖ 11కేసుల్లో రూ.11 లక్షలు వసూలు చేసినట్లు కాగ్ తెలిపింది.

**రికార్డుల తనిఖీల్లో గుర్తించిన అంశాలు ఇవే..**

2018 డిసెంబరు నుంచి 2022 మార్చి మధ్య 6 ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాల పరిధిలో అపరాధ రుసుం చెల్లింపులో అధికారులు నిర్లక్ష్యం వహించినట్లు కాగ్ తెలిపింది. 46 బార్ అండ్ రెస్టారెంట్లు తమ లైసెన్సుల పునరుద్ధరణ రుసుం, వార్షిక బార్ ఎక్సైజ్ పన్ను చెల్లింపుల విషయంలో ఆలస్యం చేసినట్లు తెలిపింది. అయితే వారికి రూ.71లక్షల అపరాధ రుసుం విధించకుండా అధికారులు వదిలేసినట్లు నిగ్గు తేల్చింది. ఈ అంశాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందని లేదని చెప్పింది.

సికింద్రాబాద్ డీపీఈవో కార్యాలయ రికార్డులను 2022ఫిబ్రవరిలో ఆడిట్ చేస్తున్న సమయంలో రెండు బార్లు రూ.24లక్షలు చెల్లించని విషయం తమ దృష్టికి వచ్చినట్లు కాగ్ వెల్లడించింది. 2020-21కి సంబంధించి రెండు బార్లు వార్షిక ఎక్సైజ్ పన్ను చెల్లించలేదని, వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీపీఈవో చెప్పారని తెలిపింది. దీనిపై 2022నవంబర్‌లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని చెప్పింది. 2017-18, 2018-19 సంవత్సరాలకు సంబంధించి మేడ్చల్ ఆర్‌కే డిస్టిలరీస్ ఎక్సైజ్ పన్ను చెల్లింపులో ఆలస్యం చేసినా అధికారులు సరైన చర్యలు తీసుకోలేదని వెల్లడించింది. ఆలస్యం చేసినందుకు విధించాల్సిన రూ.86.99లక్షల అపరాధ రుసుంను సైతం ఎక్సైజ్‌శాఖ విధించలేదని తెలిపింది. ఈ విషయం 2022జనవరిలో రికార్డులు పరిశీలించిన సమయంలో గుర్తించినట్లు కాగ్ పేర్కొంది. శంషాబాద్ డీపీఈవో పరిధిలో 12మంది బార్ లైసెన్సుదారులపైనా అధికారులు సరైన చర్యలు తీసుకోలేదని కాగ్ తన నివేదికలో తెలిపింది. 2019 జనవరి నుంచి 2020 నవంబర్ వరకూ పన్ను చెల్లింపు విషయంలో వారు ఆలస్యం చేసినా విధించాల్సిన రూ.10.44 లక్షల అపరాధ రుసుం విధించలేదని వెల్లడించింది. 2022మార్చిలో ఖమ్మం, మహబూబాబాద్ డీపీఈవోల పరిధిలో ఎలైట్ బార్లకు సంబంధించి ఆడిట్ చేశామని, అయితే మూడు బార్లు రూ.12లక్షల ఎక్సైజ్ ట్యాక్స్, అదనపు ఎక్సైజ్ ట్యాక్స్ తక్కువగా చెల్లించినట్లు గుర్తించామని కాగ్ తన నివేదికలో పేర్కొంది.

## రాహుల్.. అశోక్‌నగర్ వచ్చి మీ హామీని ఎలా నిలబెట్టుకుంటారో యువతకు చెప్పండి




హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. రాహుల్ గాంధీ జీ.. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న మీ మాటలు నమ్మి తెలంగాణ యువత కాంగ్రెస్‌కు ఓటేశారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలైనా ఇప్పటివరకు ఇచ్చిన ఉద్యోగాలు సున్నా. ఎన్ని ఉద్యోగాలో చెప్పకుండా జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారు. మరోసారి హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌కు వచ్చి యువతను కలిసి మీ హామీని ఎలా నిలబెట్టుకుంటారో చెప్పండి?.. అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ.. అశోక్‌నగర్‌కు వచ్చి యువతతో మాట్లాడుతున్న వీడియోను షేర్ చేశారు. కాగా, శుక్రవారం రేవంత్ రెడ్డి సర్కార్ అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. పోస్టుల సంఖ్య లేకుండా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గన్‌పార్క్ వద్ద నిరసనకు దిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'తొమ్మిది నెలల కిందట ఉద్యోగాల పేరిట ఎంత డ్రామా చేసిండ్రు..కేసీఆర్ అసలు ఉద్యోగాలే ఇవ్వలేదన్నట్టు తప్పుడు ప్రచారం చేసిండ్రు. అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలని పత్రికల్లో ఊదరగొట్టే విధంగా అక్రమ సంపాదనతో కాంగ్రెస్ నాయకులు ప్రకటనలిచ్చిండ్రు. రాహుల్ గాంధీని అడుగుతున్న, నువ్వు ప్రామిస్ చేసిన రెండు లక్షల ఉద్యోగాలేవీ?' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. క్యాలెండర్‌లో తేదీలు మారుతున్నాయని, మరి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఏవని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ వాళ్లు బయట కనబడితే నిరుద్యోగులు తన్నితరిమేసే పరిస్థితి ఉన్నదని దుయ్యబట్టారు. అందుకే నాలుగు కాగితాల మీద ఏది పడితే అది రాసుకొచ్చారని, అది జాబ్ క్యాలెండర్ అని ప్రకటించారని ఆక్షేపించారు. జాబ్ క్యాలెండర్ నిజమైతే అందులో రెండు లక్షలు కాదు రెండు ఉద్యోగాలు కూడా ఎందుకు పెట్టలేదని నిలదీశారు. దమ్ముంటే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి అశోక్‌నగర్‌కు రావాలని, తామంతా అక్కడికి వస్తామని కేటీఆర్ వారికి సవాల్ విసిరారు.

## మాదిగ జాతి ఎవరికి వ్యతిరేకం కాదు..

-మొదటిపేజీ తరువాయి



న్యాయ నిపునులతో కమిటీ వేసి నివేదికను సీఎం రేవంత్‌రెడ్డికు సమర్పిస్తామని వివరించారు. ఈ విషయంపై ఎలా ముందుకు వెళ్లాలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాబోయే రోజుల్లో మాదిగ సమ్మేళనం నిర్వహించి.. సీఎం రేవంత్‌రెడ్డికి సన్మానం చేస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.


**మహిళలకు కీలక ప్రకటన...**

మరోవైపు...తెలంగాణలోని మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ముదిగొండ మండలం కమలాపురంలో మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో భట్టి మాట్లాడుతూ... మధిర నియోజకవర్గంలో కొద్ది రోజుల్లోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులకు శంకుస్థాపన చేయబోతున్నామని తెలిపారు. అంగన్ వాడీలో 3 వ తరగతి వరకు ఏర్పాటు చేసి నాల్గోతరగతికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలుకు పంపించే ఏర్పాటుకు నాంది పలికామని అన్నారు.

**ఇందిరమ్మ డైరీని ప్రవేశ పెట్టాం..**

అలాంటి పాఠశాలలు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇందిరమ్మ డైరీ చిరకాల కోరిక అని వివరించారు. నియోజకవర్గంలోని మహిళలను పాడి పరిశ్రమలో వాటాదారులుగా చేసి వారిని పారిశ్రామిక వేత్తలుగా చేయడానికి 2014కు ముందే ఇందిరమ్మ డైరీని ప్రవేశ పెట్టామని వెల్లడించారు. నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలకు గేదెలు ఇచ్చి వారిని పరిశ్రమలో వాటా దారులుగా చేస్తామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగే విధంగా ఆర్థికమంత్రిగా బడ్జెట్ ప్రవేశ పెట్టామని తెలిపారు. నియోజకవర్గంలో మిగిలిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలు త్వరలోనే ప్రారంభిస్తామని మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.





# స్నేహితులా? శత్రువులా?

**అడివి శేష్ 'జీ 2' నుంచి స్పెషల్ అప్‌డేట్**

థ్రిల్లర్ సినిమాలకు తెలుగులో కేరాఫ్ అడ్రస్ నటుడు అడివి శేష్. అందరు మాస్, యాక్షన్, లవ్ జానర్‌లను పట్టుకంటే నాకంటూ కొత్తగా ఒకటి ఉండాలి అని ఏకంగా థ్రిల్లర్ జానర్ సెట్ చేసుకున్నాడు ఈ కుర్ర హీరో. ఇప్పటికే థ్రిల్లర్ అండ్ స్పై జానర్‌లో ఇతడు నటించిన క్షణం, ఎవరు, గూఢచారి, హిట్ 2 చిత్రాలు హిట్ అందుకోవడమే కాకుండా శేష్‌కు మంచి పేరు తెచ్చిపెట్టాయి. ఇక శేష్ కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రాలలో 'గూఢచారి' (%+బఝుఎష్ఘుతీఱ%2) ఒకటి. 2018లో స్పై థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ అందుకుంది. ఇప్పుడు ఇదే సినిమాకు 'జీ 2'(%+%2) అంటూ సీక్వెల్ రాబోతుంది. ఈ సినిమాకు వినయ్ కుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే ఈ సినిమాలో విలన్‌గా బాలీవుడ్ నటుడు నటించబోతున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. 'జీ 2'లో విలన్‌గా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ నటించనున్నట్లు చిత్రయూనిట్ ఇంతకుముందే ప్రకటించింది. ఇప్పుడు తాజాగా మూవీ నుంచి స్పెషల్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. 'జీ 2' నుంచి ఇమ్రాన్ హష్మీ, అడివి శేష్ వర్కింగ్ స్టిల్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఇమ్రాన్ హష్మీ గన్ పట్టుకుని ఉండగా.. అడివి శేష్ సంకెళ్లతో కనిపిస్తున్నాడు. ఈ పోస్టర్‌కి స్నేహితులా? శత్రువులా? ప్రత్యర్థులా.? అంటూ రాసుకోచ్చారు. ఈ సీక్వెల్‌లో అడివిశేష్‌కు జోడీగా బాలీవుడ్ స్టార్ నటి బనితా సంధు నటించనుంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌లపై టీవీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# నెక్ట్స్ లెవెల్ ప్లానింగ్‌తో సమంత..?

సౌత్ స్టార్ హీరోయిన్ గా తిరుగు లేని క్రేజ్ తెచ్చుకున్న సమంత కెరీర్ మధ్యలో ఎన్ని అవాంతరాలు వచ్చినా వాటిని దాటుకుంటూ సినిమాలు చేస్తూ వచ్చింది. సమంత ఏం చేసినా సంథింగ్ స్పెషల్ అనిపించేలా ఉంటుందని ఆమె ఫ్యాన్స్ నమ్ముతారు. ఈ క్రమంలో బాలీవుడ్ వెళ్లి అక్కడ వెబ్ సీరీస్ చేసిన సమంత ఇప్పుడు సిటాడెల్ హనీ బనీ సీరీస్ తో రాబోతుంది. ఈ సీరీస్ తో బాలీవుడ్ లో మరోసారి తన సత్తా చాటాలని చూస్తుంది సమంత. ఈ సీరీస్ టీజర్ రిలీజ్ టైం లో సమంత గ్లామర్ షో బాలీవుడ్ మీడియా అంతా డిస్కస్ చేసేలా చేసింది. ఇదిలాఉంటే సమంత ప్రస్తుతం మా ఇంటి బంగారం అనే సినిమా చేస్తుంది. ఆ సినిమా హీరోయిన్ మాత్రమే కాదు నిర్మాతగా కూడా కొత్త బాధ్యత మీద వేసుకుంది అమ్మడు. ఇదే కాదు సమంత పెద్ద ప్లానింగ్ తోనే నిర్మాణ రంగంలోకి దిగిందని టాక్. సమంత మరో రెండు సీరీస్ లను నిర్మించేలా ప్లాన్ చేస్తుందట. సిటాడెల్ సీరీస్ రిలీజ్ అవ్వగానే ఆ ప్రాజెక్ట్ ల గురించి అనౌన్స్ చేస్తుందని తెలుస్తుంది. రాజ్ అండ్ డీకే లతోనే సమంత వెబ్ సీరీస్ లు చేయబోతుందని టాక్. ఫ్యామిలీ మ్యాన్ 2 సీరీస్ తో రాజ్ అండ్ డీకే తో కలిసి పనిచేసిన సమంత వారి టాలెంట్ నచ్చి వారు అడిగితే చాలు కాదనకుండా చేస్తుంది. ఇక ఇప్పుడు బంగారం సినిమా తర్వాత మళ్లీ ఆ ఇద్దరి డైరెక్షన్ లోనే సీరీస్ నటించి నిర్మించేందుకు రెడీ అవుతుందట. సమంత ప్లానింగ్ చూసి ఆమె ఫ్యాన్స్ కూడా షాక్ అవుతున్నారు.



# తమిళంలో బంపరాఫర్.. కార్తీ సరసన మాళవిక మోహనన్

మలయాళం, తమిళ భాషల్లో ప్రతిభావంతురాలైన కథానాయికగా పేరు తెచ్చుకుంది మాళవిక మోహనన్. ప్రస్తుతం ఈ భామ తెలుగులో ప్రభాస్ సరసన 'రాజాసాబ్' చిత్రంలో నటిస్తున్నది. తాజాగా ఆమె తమిళంలో కార్తీ సరసన కథానాయికగా నటించే బంపరాఫర్‌ను దక్కించుకుంది. వివరాల్లోకి వెళితే.. కార్తీ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సర్దార్–2' ఇటీవలే ప్రారంభమైంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ చెన్నైలో జరుగుతున్నది. ఈ సినిమాలో మాళవిక మోహనన్ కథానాయికగా ఖరారైంది. ఈ విషయాన్ని శుక్రవారం మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని, కథాగమనంలో మాళవిక మోహనన్ పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్‌శంకర్ రాజా, నిర్మాత: ఎస్.లక్ష్మణ్ కుమార్.



# ఓటీటీలోకి ప్రియదర్శి 'డార్లింగ్'

తనదైన కామెడీ స్టైల్‌తో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న యువ నటుడు ప్రియదర్శి. మల్లేశం, బలగం సినిమాలతో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇక ఈ టాలెంటెడ్ యాక్టర్ ఇస్మార్ట్ భామ నభా నటేష్ నటించిన తాజా చిత్రం డార్లింగ్ అశ్విన్ రామ్ దర్శకత్వం వహించాడు. జూలై 19న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం థియేటర్లో మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక డిస్నీంహాట్‌స్టార్‌లో ఆగస్టు 13 నుంచి ప్రసారం కానున్నట్లు ప్రకటించింది. అనన్య నాగళ్ల డాక్టర్‌గా కనిపించిన ఈ చిత్రంలో బ్రహ్మానందం, విష్ణు, కృష్ణ తేజ్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ట్రావెల్ ఏజెన్సీలో పని చేసే రాఘవ (ప్రియదర్శి) అందమైన అమ్మాయిని పెళ్లి చేసుకొని పారిస్‌కు హనీమూన్‌కు వెళ్లాలనుకుంటాడు. తన తండ్రి చూసిన అమ్మాయి సైకాలజిస్ట్ నందిని (అనన్యనాగళ్ల)తో పెళ్లికి రెడీ అవుతాడు. కానీ నందిని ట్విస్టు ఇస్తూ చివరి నిమిషంలో ప్రేమించిన వాడితో వెళ్లిపోవడంతో వెడ్డింగ్ నిలిచిపోతుంది. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన రాఘవ ఆత్మహత్య చేసుకోవాలనుకున్న టైంలో ఆనంది (నభా నటేష్) అతడి లైఫ్‌లోకి ఎంట్రీ ఇస్తుంది. ఆ వెంటనే రాఘవ ఆనందికి ప్రపోజ్ చేయడం, ఆ వెంటనే పెళ్లి జరిగిపోతాయి. అయితే ఆనందికి మల్టీపుల్ స్ప్లిట్ పర్సనాలిటీ డిజార్డర్ కారణంగా ఆమె చేతిలో దెబ్బలు తింటాడు రాఘవ. ఇంతకీ ఆనందిలో ఉన్న పర్సనాలిటీస్ ఏంటీ.. రాఘవ ఎలాంటి కష్టాలు పడ్డాడనే నేపథ్యంలో సాగేదే స్టోరీ.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com